దేశ కీర్తిప్రతిష్టలను పెంచిన మోదీ

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి


జీపుయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న కిషన్‌రెడ్డి

ముషీరాబాద్: ప్రపంచంలో భారతదేశ కీర్తిప్రతిష్టలను పెంచిన వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీఅని సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి కొనియాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అడిక్‌మెట్ ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజల అనంతరం కిషన్‌రెడ్డి జీపు యాత్రను ప్రారంభించారు. అడిక్‌మెట్, రాంనగర్ గుండూ, లలితానగర్, బాలాజీనగర్, గణేష్‌నగర్, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, విద్యానగర్, అచ్చుత్‌రెడ్డి మార్గ్ మీదుగా రాంనగర్ డివిజన్ జెమినీ కాలనీ, బాగ్‌లింగంపల్లి, చిక్కడపల్లి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల వరకు జీపుయాత్ర సాగింది. అడిక్‌మెట్ డివిజన్ స్పెన్సర్స్ వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో ప్రధాని మోదీ చేసిన సేవలను ఏకరువు పెట్టారు. రెండేళ్లపాటు కరోనా వంటి మహమ్మారి ప్రపంచాన్నే కుదిపేయగా మోదీ తన చాకచక్యంతో దేశంలో ఎలాంటి ఉపద్రవం తలెత్తకుండా వ్యవహరించి ప్రపంచ దేశాలతో శభాష్ అనిపించుకున్నారన్నారు. గతంలో టెర్రరిస్టులు దేశంలో ఏదో ఒక మూలన మారణహోమం సృష్టించేవారని, మోదీ ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేశారని పేర్కొన్నారు. ఈ పదేళ్లల్లో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గాన్ని ఎన్నో విధాలుగా అభివృద్ధి చేశానని, రెండోసారి తనను గెలిపించాలని అన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమేష్ రామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సూర్యనారాయణశర్మ, రోయ్యూరు శేషసాయి, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు ఆర్.నరేష్, సాయికృష్ణయాదవ్, సుబ్రహ్మణ్యం, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, భరత్, కౌండిన్య ప్రసాద్, జైపాల్‌రెడ్డి, కలకోట అరుణ్‌కుమార్, కిషోర్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన కులాల అభివృద్ధికి పెద్దపీట

కాచిగూడ: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన కులాల అభివృద్ధికి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో బీజేపీ విజయం వెనుక కులసంఘాల పాత్ర కీలకంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, చింతల రాంచంద్రారెడ్డి, ఆనంద్‌గౌడ్, శ్యాంసుందర్ గౌడ్, సి.నందకిషోర్ యాదవ్, కేశబోయిన శ్రీధర్ పాల్గొన్నారు.

దళిత బహుజన పార్టీ హైదరాబాద్ అభ్యర్థిగా షేక్ బాషా


షేక్ బాషాకు బీఫామ్ అందజేస్తున్న కృష్ణస్వరూప్

కాచిగూడ: దళిత బహుజన పార్టీ హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం అభ్యర్థి షేక్ బాషాకు పార్టీ బీఫామ్‌ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అందజేశారు. ఈ సందర్భంగా నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ జస్టిస్ పునాదిగా అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని మోదీ సర్కార్ రద్దు చేస్తామనడం దారుణమన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే దళిత బహుజనులకు భవిష్యత్ లేదని, సామాజిక బానిసత్వం తప్పదని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు నరేంద్రమోదీకి రాజకీయ ఏజెంట్స్‌గా పనిచేస్తూ.. అణగారిన ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. డాక్టర్ అంబేడ్కర్ ఆలోచన విధానంతో పొలిటికల్ పవర్ సాధన కోసం పోరాటం చేస్తున్న దళిత బహుజన పార్టీ అభ్యర్థులకు ఎంపీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని అన్నారు.

ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు: ఎన్సీపీ



సదస్సులో పాల్గొన్న సునీల్‌జాదవ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ జాదవ్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేకల శ్రీధర్‌ను నియమించి సన్మానించారు. అనంతరం సునీల్ జాదవ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పేదలకు అందకుండా చేస్తున్నారని విమర్శించారు. అనుభవం లేని నాయకులు అధికారంలోకి రావడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకగా తమ పార్టీ ముందుంటుందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలో భాగస్వాములుగా అత్యధిక సీట్లను కైవసం చేసుకుంటామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు బేషడ్, ఎం.డి. ఖలీమ్, మద్దెల శ్రీనివాస్, సుధాకర్, మురళీధర్ దేశ్‌పాండే, విఠల్‌నాయక్, బింగి రాములు, రామాచారి, వేణుగోపాల్, సుంకర నరేష్, మైపాల్‌రెడ్డి, గవ్వల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేవారికే పదవులు: ఎమ్మెల్యే గోపాల్


ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు బూత్ కన్వీనర్‌ల జాబితాను అందజేస్తున్న శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: పార్టీ కోసం క్రమశిక్షణతో పని చేసే వారినే పోలింగ్ బూత్ కన్వీనర్‌లుగా నియమించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ బీఆర్ఎస్ అధ్యక్షులకు సూచించారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో డివిజన్‌కు సంబంధించిన 51 పోలింగ్ బూత్‌ల కన్వీనర్‌ల జాబితాను ఎమ్మెల్యేకు ఆయన కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ ఎన్నికలప్పుడే నాయకులమంటూ ముందుకు వచ్చే నేతలను పక్కన పెట్టి పార్టీ కోసం కష్టపడే వారికే పార్టీ పదవులను అప్పగిస్తామని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపుకు ప్రతి ఒక్కరు పని చేయాలని సూచించారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు మహ్మద్‌అలీ, డివిజన్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, మైనార్టీ కమిటి రాష్ట్ర నాయకుడు రహీం తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద కాలేజీలో ముగిసిన జాతీయ సదస్సు



ముషీరాబాద్: వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'పరస్పర ఆధారిత భౌతిక, గణిత శాస్త్రాల్లో ఇటీవలి పురోగతులు'అనే అంశంపై జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సదస్సులో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కళాశాలల అధ్యాపకులు, విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు పాల్గొని పరిశోధనాపత్రాలను సమర్పించారు. శనివారం జరిగిన ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.యాదగిరి, రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.ఎస్.ఆర్.రాజేందర్‌సింగ్‌హాజరయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ప్రసాద్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య అధ్యక్షత వహించగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత అబ్రహాం, సదస్సు కన్వీనర్లు డాక్టర్ జె.చిన్నబాబు, డాక్టర్ మల్లీశ్వరి, బి.విజయనిర్మల, ఎల్.విష్ణుప్రియ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ బాధ్యత అందరిది


అష్టవంకరల నవ భారతం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలకపల్లి రవి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి అన్నారు. శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రోల్ ఆఫ్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీస్ ఇన్ రీసెంట్ టైమ్స్ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ ఆర్థిక రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ రచించిన అష్టవంకరల నవభారతం పుస్తకాన్ని తెలుకపల్లి రవి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని సవరించడం కాదు ఏకంగా రాజ్యాంగాన్నే మార్చి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు సీనియర్ అడ్వకేట్ జి.విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అయిలు ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి, హైకోర్టు అడ్వకేట్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రకు 'రూట్‌క్లియర్'

మట్టి, చెత్తా చెదారాలు, రాళ్లురప్పల తొలగింపు • 20 లారీల్లో తరలింపు


ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో శోభాయాత్ర రూట్‌ను పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

చిక్కడపల్లి: హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా చిక్కడపల్లి నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, అశోక్‌నగర్, అరుంధతినగర్, సబర్మతినగర్, గాంధీనగర్ నూతనే లింక్‌బ్రిడ్జి వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ సిబ్బంది రెండురోజులుగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుంచి అశోక్‌నగరం క్రాస్‌రోడ్డు వరకు రోడ్లపై ఎలాంటి చెత్తాచెదారాలు, మట్టుకుప్పలు, రాళ్ళు రప్పలు లేకుండా పూర్తిగా ఎత్తివేశారు. ఇరవై లారీల్లో తరలించారు. ప్రతి ఏటా శోభాయాత్ర ఈ రోడ్డు మీదుగానే వెళ్తున్న నేపథ్యంలో ఈసారి కూడా ఇక్కడి నుంచే ర్యాలీని పంపించాలని పోలీసులు నిర్ణయించారు. కాగా, శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ కొత్తకొట శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ కమిషనర్ విక్రమ్‌సింగ్‌మాన్, తదితర పోలీసు అధికారులు కార్యక్రమ నిర్వాహకులు, భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, వీహెచ్‌పీ నేతలు బాలస్వామి, పండరీనాథ్, మహేశ్, శ్రీకాంత్ తదితరులు శోభాయాత్రకు అనువుగా ఉండేలా ఏర్పాట్లను పర్యవేక్షించారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం చిక్కడపల్లి సబ్ డివిజన్ ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం, మున్సిపల్ జోనల్ కమిషనర్, సర్కిల్15 ఏఎంవోహెచ్ మైత్రేయి పర్యటించి అన్ని ఏర్పాట్లు పరిశీలించారు.

అభినందనలు


సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న శ్రీనివాస్ తదితరులు

చిక్కడపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిని కోనసీమ ద్రవిడ సంఘం తరపున ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి సత్కరించారు. కోనసీమ ద్రావిడ సంఘం ప్రతినిధులు బండి శ్రీనివాస్, ఎంఎస్ శాస్త్రీ, కామేశ్వరరావు పాల్గొన్నారు.

24న అన్నమయ్య సంకీర్తనగానం

చిక్కడపల్లి: సాహితీ సాంస్కృతిక సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనగానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంస్థ అధ్యక్షుడు రమణకుమారి, ప్రధానకార్యదర్శులు ఎంవీ రమణకుమారి, ఎంవీ సుబ్బలక్ష్మిలు తెలిపారు. శనివారం సాయంత్రం వారు వివేక్‌నగర్‌లో మాట్లాడుతూ సంబంధిత కార్యక్రమం ఈ నెల 24న సాయంత్రం 4 గంటలకు త్యాగరాయగానసభలో ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత శోభరాజు, సంగీత సుధానిధి డీవీ మోహనకృష్ణలకు ఆత్మీయ సత్కారం చేస్తామన్నారు.

కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

చిక్కడపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ కోరారు. శనివారం గాంధీనగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రధాని నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.వినయ్‌కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 'సుందరకాండ' పారాయణం

నేటితో బ్రహ్మోత్సవాల ముగింపు

నల్లకుంట: న్యూనల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో ఈ నెల 13న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన శనివారం ఉదయం ఆలయ అర్చక స్వామి అప్పారావు మంత్రోచ్ఛారణల నడుమ శ్రీ సీతారామచంద్ర స్వాములకు సుప్రభాత సేవ, ఉపనిషత్ పూర్వక అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు కావించి సుందరకాండ పారాయణం చేశారు. ఆదివారం (నేటి)తో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి జె.మార్తాండరావు తెలిపారు.

నోటు పుస్తకాల పంపిణీ

నల్లకుంట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ ఆధ్వర్యంలో శనివారం నల్లకుంటలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీఆర్టీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.


విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న టీడీపీ నాయకుడు దశరథ్

బీఆర్ఎస్‌కు అధిక సీట్లు ఖాయం: ముఠా గోపాల్


సుందరయ్య పార్కులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లను కైవసం చేసుకుంటుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా క్లబ్ గౌరవ అధ్యక్షుడు వెంకటకృష్ణారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, పి.రాజేంద్రప్రసాద్‌గౌడ్, హౌస్‌ఫెడ్ డైరెక్టర్ అయిలినేని కిషన్‌రావు, ఎస్.రమేష్‌రెడ్డి, పి.వి.నిరంజన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షులు ఆర్.వివేక్, డాక్టర్ సునీల్, రఫీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పేదబ్రాహ్మణ విద్యార్థులకు చేయూత


కోచింగ్ సెంటర్ నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న పోచంపల్లి రమణారావు

నల్లకుంట: ప్రతిభావంతులైన పేద బ్రాహ్మణ విద్యార్థులకు చేయూతనందించేందుకు బ్రాహ్మణ సమాజం ముందుకు రావాలని శ్రీవైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పోచంపల్లి రమణారావు కోరారు. శ్రీ వైష్ణవి చారిటబుల్ ట్రస్ట్, అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 15 మంది పేద బ్రాహ్మణ విద్యార్థులకు పోటీ పరీక్షల నిమిత్తం స్టడీ మెటీరియల్, నగదు ఆర్థిక సహాయం ప్రకటించారు. శనివారం నల్లకుంటలో జరిగిన ఓ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ పోచంపల్లి రమణారావు, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ వింజమూరి ఆదిత్య, డాక్టర్ వింజమూరి ఇందిరా ప్రియదర్శినికి టీఎస్‌పీఎస్‌సీ స్టడీ మెటీరియల్, రూ. 8,500 చెక్కును అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పోచంపల్లి రమణారావు, మంత్రి సునిల్, దేవులపల్లి రంగారావు, దేశ్‌ముఖ్ రమాకుమార్, దేవులపల్లి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారంపై వీహెచ్ మౌనదీక్ష

చర్యలు తీసుకోవాలని దానం డిమాండ్


నిమ్మరసం ఇచ్చి వీహెచ్ దీక్ష విరమింపచేస్తున్న దానం నాగేందర్

అంబర్‌పేట: మాజీ ఎంపీ. వి.హనుమంతరావుపై అసత్య ప్రచారాలు చేసిన వ్యక్తులపై సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, వెంటనే బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. వి.హనుమంతరావు సిద్ధాంతానికి కట్టుబడి పదవులు వచ్చినా, రాకున్నా పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేసిన వ్యక్తి అని అన్నారు. తన రాజకీయ ప్రతిష్టను దిగజార్చేలా మీడియాలో వచ్చిన అసత్య ప్రచారాలకు నిరసనగా మాజీ ఎంపీ వీహెచ్ శనివారం డీడీ కాలనీలోని నివాసంలో మౌనదీక్ష చేపట్టారు. అనంతరం వీహెచ్‌కు దానం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. దీక్ష అనంతరం వీహెచ్ మాట్లాడుతూ బీజేపీకి తాను అనుకూలంగా మాట్లాడినట్లు వస్తున్న వార్తలను ఖండించినట్లు చెప్పారు. పార్టీలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పార్టీ కోసం పని చేశానే తప్ప వెన్నుపోటు రాజకీయాలు తనకు తెలియవని అన్నారు. వీహెచ్ దీక్షకు సంఘీభావంగా పార్టీ నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, లక్పతి యాదగిరి గౌడ్, శంభూల శ్రీకాంత్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, కోటం అనిల్, సుధాకర్ పాల్గొన్నారు.

ఉగండా మహిళలతో వ్యభిచారం.. ముఠా గుట్టురట్టు


వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్, ఇతర అధికారులు

అంబర్‌పేట: గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. శనివారం నల్లకుంట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్, ఓయూ ఏసీపీ బి.జగన్, ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావులు వివరాలు వెల్లడించారు. ముంబైలో నివసించే కెన్ లోకాండా వెబ్‌సైట్ ఏర్పాటు చేసుకొని దానితో వ్యభిచారాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఉగండాకు చెందిన ముగ్గురు మహిళలను వ్యాపారం, వైద్యం వీసాలపై ఇండియాకు పిలిపించారు. వారిని ముంబై నుంచి నల్లకుంట అడిక్‌మెట్‌లోని ఓ అపార్ట్‌మెంటులో అద్దెకు ఉంచాడు. వెబ్‌సైట్ ద్వారా విటులను ఆకర్షించాడు. అందులో బాగంగా ఆంధ్రకు చెందిన వెంకటసత్యనారాయణమూర్తి వెబ్‌సైట్ ద్వారా కెన్‌ను సంప్రందించి బేరం కుదుర్చుకున్నాడు. అనంతరం సత్యనారాయణమూర్తికి అపార్టమెంట్ చిరునామ ఇచ్చాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఐ రమదేవి తన సిబ్బందితో కలిసి అపార్ట్‌మెంట్‌పై దాడి చేసి ముగ్గురు బాధితులతోపాటు విటులను పట్టుకున్నారు. ప్రజ్వల సంస్థ సహకారంతో బాధితురాళ్లను వారి స్వదేశానికి పంపించారు. వెంకటసత్యనారాయణమూర్తిని అరెస్టు చేశారు. అతని వద్ద రూ.17.500 నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

'హోరుగాలి' కవితా సంపుటి ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖకవి కె.శాంతారావు రచించిన హోరుగాలి కవితా సంపుటిని శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో విప్లవ కవి నిఖిలేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిఖిలేశ్వర్ మాట్లాడుతూ కవిత్వం ప్రజల్లోకి సూటిగా వెళితేనే అది ప్రజావాణిగా విరాజిల్లుతుందన్నారు. సామాజిక దృక్పథంతో సాహిత్యం రావాలని అన్నారు. ప్రజలను సరైన ప్రజాస్వామిక ఉద్యమాల వైపు కవిత్వం నడిపించాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే బిడ్డలు ఎప్పటికప్పుడు పుడుతూనే ఉంటారని శాంతారావు తన కవిత్వం ద్వారా తెలియజేశారని గుర్తు చేశారు. తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కె.ఆనందచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, నవతెలంగాణ సంపాదకుడు ఆర్.సుధాభాస్కర్ పాల్గొన్నారు.

'కిడ్స్‌సమ్మర్ క్యాంప్' దరఖాస్తు గడువు పొడిగింపు

నల్లకుంట: ఓయూలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళాసభ(డీడీఎంఎస్) లిటరసీ హౌస్ అకాడమి క్యాంపస్‌లో నిర్వహించే 'కిడ్స్ సమ్మర్ క్యాంప్'నకు దరఖాస్తు గడువు పొడిగించారు. ఆసక్తి కలిగిన 7 నుంచి 12 ఏళ్ల వయసులోపు చిన్నారులు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని లిటరసీ హౌస్ కార్యదర్శి బి.నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి మే 25వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిక్షణాతరగతులు ఉంటాయన్నారు. నెలరోజులపాటు కొనసాగే ఈ శిబిరంలో కాగితపు సంచులు– ఒరిగామి ఆర్ట్, పాట్ పెయింటింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఫింగర్ పప్పెట్, ఇండిజీనియస్(స్వదేశీ) గేమ్స్ తదితర కోర్సులలో శిక్షణ ఉంటుందని చెప్పారు. వివరాలకు సెల్: 99512 10441, 70134 57432 నంబర్‌లలో సంప్రదించగలరు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు ఉచిత స్కాలర్‌షిప్ టెస్ట్

కాచిగూడ: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్(నిఫ్డ్) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కె.రాము యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులలో చేరేందుకు మే 19న కాచిగూడలోని ఇనిస్టిట్యూట్‌లో ఉచిత స్కాలర్‌షిప్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫ్యాషన్ గార్మెంట్ మేకింగ్, డిజైనింగ్, ఇలిస్ట్రేషన్, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్, ప్యాట్రన్ మేకింగ్, ఫ్యాబ్రిక్ కటింగ్, గార్మెంట్ కన్‌స్ట్రక్షన్ తదితర విభాగాల్లో 3 నెలలు, 6 నెలలు, ఒక సంవత్సరం డిప్లొమా కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల మహిళలు మే 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 90306 10033/ 98491 67839.

గురుకులాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేములు రామకృష్ణ



కాచిగూడ: గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ హాస్టళ్ల పట్ల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇటీవల భువనగిరి గురుకుల హాస్టల్లో కలుషిత ఆహారం తిని ప్రశాంత్ అనే విద్యార్థి మరణించిన ఉదంతాన్ని మరవక ముందే నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం ఫుడ్ పాయిజన్‌కు గురై 11 మంది విద్యార్థినులు ఆసుపత్రిలో చేరారని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టని యెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. పది నెలలుగా రావాల్సిన మెస్ చార్జీల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు.

దోమలగూడలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

చిక్కడపల్లి: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, నిర్భయంగా ఓటు వేయాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తూ దోమలగూడ పోలీసులు శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. హనుమాన్ ర్యాలీని శాంతియుతంగా చేపట్టాలని పోలీసులు సూచించారు. దోమలగూడ సీఐ డి.శ్రీనివాస్ రెడ్డి, డీఐ వరప్రసాద్ రెడ్డి, ఎస్ఐలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్, శాంతి, 80 మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఆ కొత్త కమిటీ చెల్లదు..

ముషీరాబాద్: రాంనగర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి బొట్టు శ్రీనివాస్ చైర్మన్‌గా ప్రకటించుకున్న నూతన కమిటీ చెల్లదని ఆలయ నిర్మాణ వంశీయుడు, ఆలయ పాత కమిటీ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనునాయుడు , కోశాధికారి ఎస్.నరహరి, ఉపాధ్యక్షుడు కె.రమేష్ అన్నారు. శనివారం ఆలయం ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2008లో నూతన కమిటీని నియమిస్తూ సొసైటీ రిజిస్టర్ ఆఫీసర్‌లో రిజిస్ట్రేషన్ చేసినట్లు చెప్పారు. ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనునాయుడు, ఉపాధ్యక్షుడు కె.రమేష్, కోశాధికారిగా నరహరి, జాయింట్ సెక్రటరీ బొట్టు శ్రీనివాస్ ఉన్నట్లు చెప్పారు. అయితే అధ్యక్షుడుగా ఉన్న జి.సురేష్‌గౌడ్, సెక్రటరీ పాడురంగారావు కొంతకాలం క్రితం చనిపోయారని తెలిపారు. అయితే బొట్టు శ్రీనివాస్ పాత కమిటీ ఉండగానే కొత్త కమిటీని స్థానికేతరులతో వేయించుకొని సభ్యులు, భక్తులను అయోమయానికి గురిచేశారని ఆరోపించారు. త్వరలో సొసైటీ చట్టం ప్రకారం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని నియమిస్తామన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు ద్వారానే సమాధానం

వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: పార్లమెంటు సీట్ల కేటాయింపులో మాదిగలను వంచించిన కాంగ్రెస్ పార్టీకి ఓటు ద్వారానే సమాధానం చెబుతామని టీఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ స్పష్టం చేశారు. శనివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్‌జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క ఎంపీ సీటు ఇవ్వకుండా అణగదొక్కుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై వంగపల్లి ధ్వజమెత్తారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాదిగలకు రెండు ఎంపీ సీట్లు ఇవ్వాలని దీక్ష చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీట్ల కేటాయింపులో మాదిగలను పూర్తిగా విస్మరించిన కాంగ్రెస్ పార్టీని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామన్నారు. మూడు రిజర్వ్‌డ్ పార్లమెంటు సీట్లలో ఒక్కటి కూడా మాదిగలకు ఇవ్వని కాంగ్రెస్ పార్టీకి మాదిగలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ మల్లేష్, బంగారు శ్రీనివాస్, చిలకమర్తి గణేష్, రమేష్, వరలక్ష్మి, వేణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలను విస్తృతం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాతావాకర్స్ క్లబ్ నల్లకుంట ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని నిర్ణయించినట్లు క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు తెలిపారు. శనివారం పద్మకాలనీ కమ్యూనిటీ హాల్‌లో క్లబ్ సర్వసభ్య సమావేశం జరిగింది. మురళీధరుడిని సంస్థ పక్షాన ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకోవడంతోపాటు హెల్త్ క్యాంపులు, చలివేంద్రాలు ఏర్పాటు వంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కానున్నట్లు తెలిపారు. అనంతరం క్లబ్ సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీనివాసాచారి, ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు రామానందం, వి.నాగభూషణం, ఉపాధ్యక్షులు వెంకట్, కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, సలహాదారులు రామలింగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం

కాచిగూడ: గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్‌పరిధిలో శనివారం జరిగింది. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... శ్యాంబాబా టెంపుల్ వద్ద పుట్‌పాత్‌పై ఓ గుర్తుతెలియని మహిళ (50) మృతి చెంది ఉంది. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురికి తరలించారు.